ఇష్టారాజ్యంగా పార్కింగ్!

వాహనదారులు వాహనాలను ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేసేస్తున్నారు. రోడ్డుపై ఖాళీ జాగా కనిపిస్తే చాలు ఠక్కున వచ్చి వాలిపోతున్నారు. రహదారులను పార్కింగ్‌కు అడ్డాగా మార్చేస్తున్నారు. ఓ వైపు ట్రాఫిక్ సమస్య, మరోవైపు ప్రమాదాలు జరుగుతున్నా తమకేమీ కాదన్నట్లు వ్యవహరిస్తున్నారు. అధికారులు సైతం చర్యలు చేపట్టకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

- విచ్చలవిడిగా వాహనాల నిలుపుదల
- వైట్ మార్జిన్ దాటి మరీ రోడ్లపై పార్కింగ్
- షాపింగ్‌మాల్స్, బ్యాంకులు, షాపుల వద్ద అధికం
- తరచూ తలెత్తుతున్న ట్రాఫిక్ సమస్య
- పెరుగుతున్న ప్రమాదాలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



రాజాం ఎస్‌బీఐ బ్రాంచి వద్ద రోడ్డుపైనే నిలిపిన బ్యాంకు అధికారుల వాహనం



యూనియన్ బ్యాంకు ముందు ఇలా..



మాధవబజార్ రోడ్డులో వాహనాల పార్కింగ్‌తో ఇరుకుగా మారిన రోడ్డు

రాజాం: పట్టణంలో హోటళ్లు, షాపింగ్‌మాల్‌లు, పెద్దపెద్ద దుకాణాలు రోజురోజుకూ ఎక్కువవుతున్నాయి. దీంతో పాటు రోడ్ల పక్కనే కొత్త భవనాల నిర్మాణం జరుగుతోంది. అయితే వాటి నిర్మాణ సమయంలో వాహన బోర్డింగ్ అనుమతులు తీసుకోకపోవడంతో వాహనాలను షాపుల బయటే పార్కింగ్ చేయాల్సి వస్తోంది. గత ప్రభుత్వ హయాంలో రాజాం ప్రధాన రహదారిలో అటు శ్రీకాకుళం రోడ్డు నుంచి ఇటు బొబ్బిలి సెంటర్ వరకు భారీగా రోడ్డును విస్తరించారు. దీంతో ఈ రోడ్డులో పెద్దఎత్తున షాపింగ్‌మాల్స్ ఏర్పడ్డాయి. వీటికి తోడు ఎస్‌బీఐ, ఏపీజీవీబీ, యూనియన్, కెనరా బ్యాంకులను ఈ రోడ్డులోనే ఏర్పాటు చేశారు. వీటికి పార్కింగ్ స్థలం లేకపోవడంతో రోడ్ల మీదనే అక్కడికి వచ్చే వాహనదారులంతా తమ వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. ఆయా బ్యాంకుల్లో పనిచేసే సిబ్బంది, అధికారులు సైతం తమ వాహనాలను రోడ్డుపైనే నిలుపుదల చేయడంతో 80 అడుగుల రోడ్డు, 30 అడుగుల రోడ్డు మాదిరిగా తయారై, తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు, పాదచారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ట్రాక్టర్లు, లారీలు సైతం..

రాజాం ప్రధాన రహదారిలో వైట్ మార్జిన్ క్రాస్ చేస్తూ ట్రాక్టర్లు, లారీలు, కార్లును కూడా పార్కింగ్ చేస్తున్నారు. కనీసం పాదచారులు నడిచే దారి కూడా కనిపించనంతగా వాహనాలను నిలుపుదల చేస్తున్నారు. మాధవబజార్, తిరుమల కాంప్లెక్స్ మార్కెట్‌లలో కూడా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. రోడ్ల మీదనే వాహనాలు వదిలేసి, తమ పనులు చూసుకునేందుకు వెళ్లిపోవడంతో ఆ దారిలో వచ్చే మిగతా వాహనదారులు ముందుకు కదలలేకపోతున్నారు. ఇది చాలదన్నట్లుగా తిరుమల కాంప్లెక్స్, ఎన్టీఆర్ కాంప్లెక్స్ ప్రాంతాల్లో రోడ్ల మీదే తమ షాపుల బోర్డులను పోటాపోటీగా యజమానులు పెడుతుండడంతో రోడ్డు మరింత ఇరుకుగా మారింది. కనీసం అక్కడి ద్విచక్ర వాహనాలు కూడా మార్కెట్‌లోకి వెళ్లలేని పరిస్థితి.

చర్యలు శూన్యం...

నిబంధనలు ఉల్లంఘిస్తూ వాహనాలను రోడ్లపై పార్కింగ్ చేస్తున్నా అటు పోలీస్ యంత్రాంగం, ఇటు మున్సిపల్ యంత్రాంగం చర్యలు తీసుకోవడం లేదు. పెద్దపెద్ద షాపులు, అద్దె భవనాలు నిర్మించే సమయంలో పార్కింగ్ నిబంధనలు పాటించేలా నిర్మాణాలు ప్లాన్ చేసుకోవాల్సి ఉన్నా ఇక్కడి మున్సిపల్ అధికారులు, వుడా అప్రూవల్ లభిస్తుండడంతో పార్కింగ్, బోర్డింగ్ స్థలాలు లేకుండానే నిర్మాణాలు జరిగిపోతున్నాయి. అటు షాపులు, భవనాల యజమానులపై, ఇటు అక్రమంగా వాహనాలను పార్కింగ్ చేస్తున్న వాహనదారులపై అధికారుల చర్యలు లేకపోవడంతో పరిస్థితి రోజురోజుకూ దారుణంగా తయారవుతోందని, ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు..

నిబంధనలు అతిక్రమించి వాహనాలు పార్కింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. వైట్ మార్జిన్ దాటి వాహనాలు నిలుపుదల చేయరాదు. ఇప్పటికే పట్టణంలోని అన్ని వ్యాపార, వాణిజ్య సంస్థల యజమానులకు సూచనలిచ్చాం. మరోసారి అందరికీ చెబుతాం.

–కె.అశోక్‌కుమార్, సీఐ, రాజాం టౌన్

క్లుప్తంగా

జిల్లా స్థాయి పోటీలకు 80 మంది ఎంపిక



జిల్లా పోటీలకు ఎంపికైన విద్యార్థులతో సిబ్బంది

బాడంగి: జిల్లా స్థాయి క్రీడాపోటీలకు మొత్తం 80 మంది క్రీడాకారులు ఎంపికైనట్లు పీడీ బంగారునాయుడు తెలిపారు. మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం జరిగిన నియోజకవర్గ స్థాయి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, చదరంగం తదితర పోటీల్లో రామభద్రపురం, బాడంగి, బొబ్బిలి, తెర్లాం మండలాల విద్యార్థులు పాల్గొని, విశేష ప్రతిభ కనబరచడంతో జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలోని డీవీఎం పాఠశాల మైదానంలో జరిగే జిల్లా పోటీల్లో వారు పాల్గొంటారని, అక్కడ ఎంపికైతే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆడుతారన్నారు.

బ్యాటరీ సైకిల్ అందజేత



విద్యార్థికి నాలుగు చక్రాల సైకిల్ అందజేస్తున్న దృశ్యం

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని పొనుగుటివలస గ్రామానికి చెందిన దివ్యాంగ విద్యార్థి పుట్టా జగదీష్‌కు లోలుగు సుశీలమ్మ ఫౌండేషన్ అధినేత లోలుగు మదన్ నాలుగు చక్రాల బ్యాటరీ సైకిల్ వితరణ చేశారు. డోలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న సదరు విద్యార్థికి పాఠశాలకు వెళ్లేందుకు ఇబ్బందిగా ఉండడంతో సాయం కోసం ఫౌండేషన్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు రూ.40 వేలతో సైకిల్ కొనుగోలు చేసి, వైద్యుడు సామంతుల కిరణ్ చేతులమీదుగా గురువారం అందజేశారు. కార్యక్రమంలో గున్నంనాయుడు, రమేష్‌కుమార్, మహేష్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి



వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న రిటైర్డ్ ఎంఈవో సత్యనారాయణ, లైబ్రేరియన్ కృష్ణమూర్తి

తెర్లాం: శాఖా గ్రంథాలయంలో వాల్మీకి జయంతి గురువారం ఘనంగా నిర్వహించారు. లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈవో ఎం.సత్యనారాయణ, పాఠకులు కలిసి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. రామాయణం రచించిన గొప్ప రచయిత, కవి వాల్మీకి అని వక్తలు కొనియాడారు. శ్రీరామనామం జపించడం, రామాయణ పారాయణం చేయడం ద్వారా ఆధ్యాత్మిక జ్ఞానం సంపాదించుకోవచ్చన్నారు. మహనీయుల మంచి పనులను ఎల్లప్పుడూ స్మరించుకోవాలని, అదే మనం వారికి ఇచ్చే నిజమైన నివాళి అన్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మించాలని వినతి



ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి: పట్టణంలోని కొత్త ఎరుకల వీధిలో కమ్యూనిటీ హాల్ నిర్మించాలని అక్కడి ప్రజలు కోరుతున్నారు. వార్డు సందర్శనలో భాగంగా మహారాణిపేట, కొత్త ఎరుకల వీధికి గురువారం వెళ్లిన మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మిని వారు కలిసి తమ సమస్యను వివరించారు. మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేయాలని, శిథిలావస్థలోని విద్యుత్‌స్తంభాల స్థానంలో కొత్తవాటిని వేయాలని స్థానికులు అభ్యర్థించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆమె హామీ ఇచ్చారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న బహుజన నేతలు

రాజాం సిటీ: విశాఖపట్నంలో ఈ నెల 20వ తేదీన జరిగే ప్రజాగాయకుడు గద్దర్ సంస్మరణ సభకు తరలిరావాలని బహుజన నేతలు పిలుపునిచ్చారు. స్థానిక అంబేడ్కర్ జంక్షన్‌లో సభకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ప్రజాచైతన్యానికి తన జీవితాన్నే త్యాగం చేసిన మహోన్నతమైన వ్యక్తి గద్దర్ అని కొనియాడారు. కార్యక్రమంలో జె.నీలయ్య, డి.రామప్పడు, బి.బుద్ధుడు, ఆర్.గణపతిరావునాయుడు, జి.తవిటయ్య, వి.పాపారావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి



తెర్లాం: మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి రామారావు

తెర్లాం: గ్రామాల్లో నిర్వహిస్తున్న గ్రామ సందర్శన కార్యక్రమం ద్వారా గుర్తించిన ప్రజా సమస్యల పరిష్కారానికి అన్ని శాఖల అధికారులు కృషి చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి, మండల ప్రత్యేకాధికారి వి.టి.రామారావు సూచించారు. మండలంలోని లోచర్ల గ్రామంలో ఎంపీడీవో రేగి రాంబాబు ఆధ్వర్యంలో గురువారం గ్రామ సందర్శన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని సచివాలయం, ఆర్‌బీకే, హెల్త్ వెల్‌నెస్ సెంటర్, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలను సందర్శించి, అక్కడి సిబ్బంది పనితీరు పరిశీలించి పలు సూచనలు చేశారు. సమస్యల పరిష్కారంలో మండల స్థాయి అధికారులంతా సమన్వయంతో కలిసి పని చేయాలని కోరారు.

సంతకవిటి: మండలంలోని గోళ్లవలస గ్రామంలో సర్పంచ్ దాసరి దాలినాయుడు ఆధ్వర్యంలో గ్రామ సందర్శన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఎంపీడీవో కె.సురేష్‌కుమార్ తదితరులు కలిసి, గ్రామంలోని సచివాలయం, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ప్రజాసమస్యలపై పలువురి నుంచి వినతిపత్రాలు స్వీకరించారు.

ఘనంగా నందెన్న ఉత్సవాలు

వాడవాడలా నందెన్న ఉత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. గౌరీపౌర్ణమి పురస్కరించుకుని, పార్వతీదేవి సమేత పరమేశ్వరుని విగ్రహాన్ని మండపంలో ప్రతిష్ఠించి, ప్రత్యేక పూజలు చేశారు. పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లేలా దీవించాలని వేడుకున్నారు. కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి.

–బొబ్బిలి, రాజాం



బొబ్బిలిరూరల్: పక్కి గ్రామంలో పూజలందుకుంటున్న నందెన్న



రామభద్రపురం కర్ణి వీధిలో నందెన్నకు పూజలు చేస్తున్న భక్తులు



రాజాం: డోలపేటలో గౌరీదేవికి పూజలు చేస్తున్న మహిళలు



రాజాం: కొత్తపేటలో పార్వతీపరమేశ్వరుల విగ్రహ ఊరేగింపు



రాజాం సిటీ: లచ్చయ్యపేటలో నందెన్నకు పూజలు చేస్తున్న భక్తులు



బొబ్బిలి: గొల్లపల్లిలో పూజలందుకుంటున్న నందెన్న

వంద రోజుల పని కల్పించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో రామకృష్ణ

బాడంగి: ఉపాధి హామీ పథకం పనుల్లో భాగంగా ప్రతీ కుటుంబానికి వంద రోజుల పని కల్పించాలని ఎంపీడీవో ఎస్.రామకృష్ణ సూచించారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం సిబ్బందితో గురువారం సమావేశమైన ఆయన.. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా ప్రతీ గ్రామంలో సిటిజన్ ఇన్‌ఫర్మేషన్ బోర్డులను విధిగా రాయాలని తెలిపారు. ఫారం పాండ్‌లు, రూఫ్ హార్వెస్టింగ్ నిర్మాణాలు చేపట్టాలన్నారు. గోకులాల అంచనాలు రూపొందించి, అందివ్వాలన్నారు. సమావేశంలో ఏపీవో విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల మొక్కలు పెంచండి



పిన్నవలస పాఠశాలలో కూరగాయల మొక్కలు పరిశీలిస్తున్న అధికారులు

బాడంగి: పాఠశాలల ఖాళీ ప్రదేశాల్లో పండ్ల మొక్కలతో పాటు కూరగాయల మొక్కలను పెంచాలని మండల నోడల్ ఆఫీసర్ నర్సింహారెడ్డి సూచించారు. గ్రామ సందర్శనలో భాగంగా మండలంలోని పిన్నవలస గ్రామానికి గురువారం వెళ్లిన ఆయన అక్కడి ప్రభుత్వ పాఠశాలకు వెళ్లి, అక్కడి పరిసరాలను పరిశీలించారు. పిల్లలకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అంతకుముందు గ్రామ సచివాలయంలో జరిగిన గ్రామసభలో పలు ప్రజాసమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.రామకృష్ణ, ఎంఈవో లక్ష్మణదొర, ఏవో శిరీష, ఏపీఎం రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

రామభద్రపురం: గ్రామాల్లో మద్యం బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ పి.చిన్నంనాయుడు హెచ్చరించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు సులోచనరాణిని గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయన కాసేపు విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం పాత మద్యం పాలసీని నిలిపి వేసి నూతన మద్యం పాలసీని తీసుకురావడంతో ప్రవేటు వ్యక్తులు మద్యం దుకాణాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. నియోజకవర్గంలో 23 మద్యం దుకాణాలు ప్రారంభమయ్యాయని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం దుకాణాల ఏర్పాటుతో పాటు మద్యం విక్రయాలు జరపాలన్నారు. 26వ తేదీ వరకు తాత్కాలిక లైసెన్స్‌లు ఇచ్చామని, ఆ తర్వాత అన్ని నిబంధనలకు లోబడి ఉంటేనే పర్మనెంట్ అనుమతులు ఇస్తామన్నారు. హైవేకు, గుడి, బడులకు 220 మీటర్ల దూరంలో మద్యం దుకాణాలు నిర్వహించాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రేగిడి: సబ్‌స్టేషన్ పరిధిలోని 33/11 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల నేపథ్యంలో సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని డీఈఈ బి.ఫణికుమార్ ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ అసౌకర్యం ఉంటుందని, వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

బొబ్బిలి: పట్టణంలోని గాంధీబొమ్మ, చీపురుపల్లి వీధి, వెలమ వీధి, హాస్పిటల్ రోడ్డు, సాయినగర్, స్వామివారి వీధి, టీఆర్ కాలనీ, నాయుడు కాలనీ, మారుతీనగర్, కోవెల సెంటర్, షాదీఖానా ప్రాంతాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ అనంతరావు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. పట్టణంలోని కోటి చెరువు వద్ద విద్యుత్ తీగలను ఆనుకుని ప్రమాదకరంగా ఉన్న చెట్లకొమ్మలు తొలగిస్తున్న నేపథ్యంలో ఈ అసౌకర్యం కలుగుతోందన్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

బొబ్బిలిరూరల్: మండలంలోని మెట్టవలస, కొత్తపెంట, పనుకువలస, గున్నతోటవలస గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఈఈ అనంతరావు తెలిపారు. విద్యుత్ తీగలను ఆనుకుని ఉన్న చెట్లకొమ్మల తొలగింపు పనుల నేపథ్యంలో ఈ అసౌకర్యం కలుగుతోందని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఎన్నికల ప్రక్రియ ప్రారంభం

రామభద్రపురం: మండలంలో సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనట్లు తహసీల్దారు సులోచనరాణి తెలిపారు. ఇదే విషయమై మండల కేంద్రంలోని తన కార్యాలయంలో విలేకరులతో గురువారం మాట్లాడారు. మండలంలో మధ్య తరహా నీటి సంఘాలు రెండు ఉన్నాయని, వాటిలో పెద్దగెడ్డకు సంబంధించి కొట్టక్కి, రామభద్రపురం సంఘాలు ఉన్నాయన్నారు. అలాగే చిన్న తరహా నీటి సంఘాలు మూడు ఉన్నాయని, వాటిలో ఏడొంపులగెడ్డ కోటశిర్లాం, నేరెళ్లగెడ్డ సిస్టం కొట్టక్కి, ఎర్రగెడ్డ కొత్తరేగ సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నామన్నారు. పంట కాలువల పరిధిలోని రైతులకు మాత్రమే ఓటు హక్కు ఉంటుందని, ప్రస్తుతం ఓటర్ల జాబితా సిద్ధం చేస్తున్నామన్నారు. రెండు రోజుల్లో ప్రాథమిక ఓటర్ల జాబితా విడుదల చేస్తామన్నారు.

మాదక ద్రవ్యాలతో అనర్థాలు

రాజాం సిటీ: మాదక ద్రవ్యాలతో ఎన్నో అనర్థాలు చోటుచేసుకుంటాయని ఎస్‌ఐ ఆర్.నర్సింహమూర్తి హెచ్చరించారు. స్థానిక నారాయణ కళాశాలలో సంకల్పం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగం దాని వల్ల కలిగే అనర్థాలపై గురువారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం యువత ఎక్కువగా మద్యం, ఖైనీ, గుట్కా, గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలై తమ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చెడు అలవాట్లకు లోనుకాకుండా మంచి అలవాట్లు అలవర్చుకోవాలని సూచించారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు



వీఆర్‌వోలతో మాట్లాడుతున్న తహసీల్దారు శ్రీను

బొబ్బిలిరూరల్: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో శుక్రవారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు ఎం.శ్రీను తెలిపారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో వీఆర్‌వోలతో గురువారం సమావేశమైన ఆయన.. గతంలో జరిగిన భూముల రీసర్వేలో చోటుచేసుకున్న తప్పులు సదస్సు దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ నెల 18 నుంచి 24వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించి, ప్రజల నుంచి అర్జీలు స్వీకరించాలని, వాటిలోని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. శుక్రవారం ఉదయం కారాడ గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించడం జరుగుతుందన్నారు. సమావేశంలో హెచ్‌డీటీ సుబ్బారావు, ఆర్‌ఐ రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల సమగ్రాభివృద్ధే లక్ష్యం

- పల్లె పండగలో ఎమ్మెల్యే బేబీ నాయన



రామభద్రపురం: తారాపురంలో అభివృద్ధి పనుల శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

రామభద్రపురం: గ్రామాల సమగ్రాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని తారాపురం గ్రామంలో పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేయడంతో పాటు శిలాఫలకం గురువారం ఆవిష్కరించారు. బొబ్బిలి నియోజకవర్గంలోని రామభద్రపురం, బాడంగి, తెర్లాం, బొబ్బిలి మండలాల్లో ఉన్న అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అన్ని ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరుస్తామన్నారు. పెద్దగెడ్డ సాగునీటి కాలువను విస్తరిస్తూ బాడంగి మండలంలోని డొంకినవలస చివరి ఆయకట్టు వరకు సాగునీరు వచ్చేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బెవర రవణమ్మ, ఎంపీటీసీ సభ్యులు బెవర సునీత, మడక తిరుపతినాయుడు, వసంతుల తిరుపతిరావు, బవిరెడ్డి చంద్ర, చింతల రామకృష్ణ, ఎంపీడీవో రత్నం, డీఈఈ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలిరూరల్: పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని దిబ్బగుడ్డివలస, కలువరాయి, గున్నతోటవలస, నారాయణవలస గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ప్రజాప్రతినిధులు భూమిపూజ చేశారు. మెట్టవలసలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బేబినాయన పాల్గొని, ఉపాధి హామీ పథకం నిధులతో ప్రతీ గ్రామంలో సీసీ రోడ్లు, కాలువలు నిర్మిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.రవికుమార్, ఈవోపీఆర్‌డీ భాస్కరరావు, ఏవో అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

తెర్లాం: మండలంలోని ఎం.ఆర్.అగ్రహారం, కూనాయవలస గ్రామాల్లో పల్లె పండగ కార్యక్రమం నిర్వహించి, పలు అభివృద్ధి పనులకు సర్పంచ్ లక్ష్మి భూమిపూజ చేశారు.

బాడంగి: మండలంలోని పిన్నవలస, కోడూరు, వీరసాగరం, డొంకినవలస, లక్ష్మీపురం, పింద్రంగివలస గ్రామాల్లో పల్లె పండగ కార్యక్రమం నిర్వహించి, పలు అభివృద్ధి పనులకు నాయకులు భూమిపూజ చేశారు.

గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు



వి.చిన్నయ్యపేటలో గొర్రెలకు నట్టల నివారణ మందు వేస్తున్న సిబ్బంది

తెర్లాం: గొర్రెలు, మేకలకు వ్యాధులు సోకకుండా నట్టల నివారణ మందులు వేస్తున్నట్లు మండల పశు సంవర్ధకశాఖ వైద్యాధికారి జె.నరేంద్ర తెలిపారు. మండలంలోని నందిగాం, వి.చిన్నయ్యపేట తదితర గ్రామాల్లోని గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు వేసే కార్యక్రమం గురువారం చేపట్టారు. ఆయా గ్రామాల్లో జరుగుతున్న కార్యక్రమాన్ని పరిశీలించిన ఆయన.. గొర్రెలు, మేకలన్నింటికీ తప్పనిసరిగా నట్టల నివారణ మందు వేయించాలని గొర్రెల కాపర్లకు సూచించారు. కార్యక్రమంలో సచివాలయ పశు సంవర్ధకశాఖ సహాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలి



స్కావెంజర్లకు సూచనలిస్తున్న ఎంఈవో త్రినాథరావు

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల్లోని మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలని స్కావెంజర్లకు ఎంఈవో త్రినాథరావు సూచించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం సందర్శించిన ఆయన అక్కడి మరుగుదొడ్లను పరిశీలించి, పలు సూచనలు చేశారు. రోజుకు కనీసం నాలుగైదు సార్లు మరుగుదొడ్లు శుభ్రం చేయాలని, ఏ పాఠశాలలోనైనా తాను తనిఖీ చేసేటప్పుడు మరుగుదొడ్లు శుభ్రంగా లేకపోతే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. అనంతరం స్కావెంజర్లకు మరుగుదొడ్లు శుభ్రం చేసే లిక్విడ్‌ను అందజేశారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

జీవామృతం తయారీపై అవగాహన

రేగిడి: మండలంలోని చాటాయవలస గ్రామంలో జీవామృతం తయారీపై గురువారం అవగాహన కల్పించారు. ఏవో జి. మురళీకృష్ణ, ప్రకృతి వ్యవసాయం ఐసీఆర్‌పీ పైల తవిటినాయుడు కలిసి ప్రయోగాత్మకంగా జీవామృతం తయారీని చేసి, చూపించారు. రైతులంతా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు వచ్చే వ్యవసాయ విధానాలను అవలంబించాలని తెలిపరు. జీవామృతం పంటలపై వేసుకోవడం ద్వారా తెగుళ్లు, చీడపీడలు తగ్గుతాయన్నారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీలు పాదిలాపు సురేష్, కూనుబిల్లి రమణ, రెడ్డి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య తనిఖీలు

రేగిడి: మండలంలోని దేవుదళ, బూరాడ, ఉంగరాడ, చిన్నశిర్లాం, పెద్దశిర్లాం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు గురువారం ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. అనంతరం మెరుగైన ఆరోగ్యానికి పలు సూచనలు చేశారు. రోజువారీ ఆహారంలో తప్పనిసరిగా పౌష్టికాహారం ఉండేలా చూసుకోవాలని వైద్యారోగ్య సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, హెల్త్ అసిస్టెంట్‌లు, ఆశ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని చాటాయివలస, ఉప్పర్నాయుడువలస గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న విద్యార్థులకు గురువారం ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న విద్యార్థులకు మందులు అందజేసి, ఆరోగ్య సలహాలు ఇచ్చారు.

అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరచాలి

రేగిడి: విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరచాలని ఎంఈవో బి.ఎరకయ్య సూచించారు. మండలంలోని సంకిలి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆయన గురువారం సందర్శించారు. అక్కడి సిబ్బంది పనితీరు, తరగతుల నిర్వహణ, రికార్డులను పరిశీలించి, పలు సూచనలు చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఆహారం అందివ్వాలని తెలిపారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు వండిపెట్టాలన్నారు.

రేగిడి: మండలంలోని గుళ్లపాడు, ఉంగరాడ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను తహసీల్దారు ఎల్లారావు, ఎంఈవో ప్రసాదరావులు గురువారం సందర్శించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని, వారి ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు.



విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పరిశీలిస్తున్న ఎంఈవో ఎరకయ్య